# లక్ష్మణరేఖ

అపర్ణ మునుకుట్ల గునుపూడి






రాణీ వారి ఆజ్ఞ అయిన తక్షణం సైనికులంతా బిలబిలమంటూ బయలుదేరారు. ప్రస్తుతం వాళ్ళున్న స్థావరంలో మునుపు అన్ని విధాలా బాగుండేది. హాయిగా చుట్టుపక్కల పంట పొలాలు. వర్షాకాలానికి సరిపడా కావల్సినన్ని దినుసులు నిలువ చేసుకోడానికి వీలుగా బోలెడు రకాల ధాన్యాలు దొరికేవి. అలాంటిది మెల్లిమెల్లిగా వర్షాలు తగ్గిపోవడంవల్ల నీటి ఎద్దడితో ఆ ప్రాంతమంతా బంజరవడం మొదలయ్యింది. తిండి దొరకడం కష్టం అవుతోంది. కరువు రోజులా అన్నట్టు అందరూ ఒకళ్ళకి దొరికిన తిండికోసం ఇంకొకళ్ళు కొట్టుకోవడాలు మొదలయ్యాయి. రాణికి ఏం చెయ్యాలో పాలు పోవడం లేదు. ఈ స్థావరం వదిలి మరో స్థావరం చూసుకోవడం తప్పనిసరి అయ్యింది. దాంతో, రాణి తన ముఖ్య అనుచరులను వెంటబెట్టుకుని ముందుగా చుట్టుపక్కల ప్రాంతాలు కలయదిరిగి ఎక్కడయితే బాగుంటుందో చూసొచ్చింది. అక్కడ చుట్టూరా బోలెడు చెట్లూ, చేమలూ ఉండి ఇళ్ళన్నిటి ముందరా చక్కగా ముగ్గులు వేసి ఉండడం అదీ చూసి బాగా జనసంచారం ఉన్నదన్న విషయం నిర్ధారణ చేసుకుని, జనంతోబాటు ఉంటే కొంతకు కొంతైనా వాళ్ళమీద అధారపడి బతుకు గడపొచ్చునన్న నిర్ణయానికి వచ్చి స్థావర మార్పిడి అమలు చేసింది. అందుకే ఇప్పుడు అందరూ కొత్త చోటికి వలస బయలుదేరారు. కొందరు ముందుగా వెళ్ళి చోటు చూసొచ్చి అక్కడికి ఏదారంబట వెళ్ళాలో వెనక వచ్చేవాళ్ళకి క్రమం తప్పకుండా చెప్పుకుంటూ వస్తున్నారు. ఒక్కరు కూడా దారి తప్పకుండా, వెనకబడకుండా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకుని, దారిలో ఏప్రమాదం వచ్చినా ఎలా రక్షించుకోవాలో మాట్లాడుకుని, క్షేమంగా అక్కడికి చేరాలన్న పట్టుతో బయలుదేరారు. అందరూ వరుసకట్టి ముందుగా వెళ్ళొచ్చిన వాళ్ళు చెప్పే వివరాలు తెలుసుకుంటూ చకచకా నడిచేస్తున్నారు. సుమారు పది లక్షల పైగా ఉన్న సైన్యాన్ని స్థావర మార్పిడి చెయ్యాలంటే మాటలుకాదు. ఎన్ని రకాల కట్టుదిట్టాలు చేసినా ఎవరో ఒ కరు ఏవో దుడుకుపనులు చేస్తూనే ఉంటారు, దారి తప్పుతారు, ఆపదలో చిక్కుకుంటారు. అందరూ అక్కడికి చేరేవరకూ రాణీకి ఖంగారుగానే ఉంది. అక్కడికి వెళ్ళి చేరేక కొత్త చోట ఏవేం చెయ్యాలో ఆలోచించడం మొదలు పెట్టేరు. ఉన్నవాళ్ళలో కాస్త పెద్దవాళ్ళూ, అనుభవం ఉన్నవాళ్ళనీ ఎంచి, నాలుగు వైపులా వెళ్ళి తిండి ఎక్కడుందో వెతుక్కు రమ్మని పంపింది. మిగతావాళ్ళని తెచ్చుకున్న తిండిని దాచుకునేందుకు చోటు చెయ్యమంది. ఇక మిగిలినది బాగా పెద్దవాళ్ళు, లేకపోతే చిన్నవాళ్ళూ. అందులో ఒక ముసలి వగ్గు ఈ చిన్నవాళ్ళందరినీ పోగు చేసి "ఇదిగో పిల్లలూ! నేను ఇప్పటికి బోలెడుమార్లు స్థావరాలు మారేను. రకరకాల ప్రాంతాలు తిరిగేను. ఎక్కడెక్కడ పరిస్థితులెలా ఉంటాయో, మనమెలా మసలుకోవాలో చెబుతాను వినండి. మీకు ముందు ముందు పనికి వస్తుంది. పంటపొలాల్లో ఉంటే అక్కడ గాలికి రాలి పడిన ధాన్యం దినుసులనే తీసుకోవాలి. మొక్కని ఎన్నడూ ఎక్కకూడదు సుమా! పేరాశపడి మొక్కనెక్కితే మొదటికే మోసం వస్తుంది. పొరపాటున కనక యజమాని కళ్ళబడ్డామంటే మన పని సఫా. మన రాజ్యం అంతా నేలమీదే ఊళ్ళో పెద్దచెట్లకింద ఉంటే చెట్ల కాయలూ, పళ్ళూ రాలిపడతాయికదా. వాటిమీదనే అధారపడాలి. చెట్టు మొదట్లో బెరళ్ళలో ఉన్న బంక దొరికితే మంచిది. మహా రుచిగా ఉంటుంది. కాని ఆ బంక కన్నా పైకెక్కేరంటే మనం పక్షుల కళ్ళబడిపోతాం. అది మళ్ళీ ప్రమాదం. తుప్పల్లోనూ, పూపొదల్లోనూ మనకి అట్టే బేరాలు దొరకవు. పూవుల్లో పుప్పొడి బాగానే ఉంటుందికానీ దాన్ని తుమ్మెదలకి

వదిలెయ్యాలి. అది వాళ్ళ సొత్తు. అక్కడికి మనం వెళితే తుమ్మెదల దండు మనమీద దాడీ చేస్తుంది. మనం తట్టుకోలేం. ఇక ఇళ్ళవైపుకి వెళితే ముందుగా వాకిట్లో ముగ్గు వేసుంటే ఆ ముగ్గు దాకానే వెళ్ళాలి. అది మనకోసమే అన్నట్టు ముగ్గుని చక్కగా బియ్యప్పిండితో వేస్తారు. అదంతా మనకి పనికొచ్చే ఆహారమే. కాస్త పెట్టే తల్లయితే పెద్ద ముగ్గు వేసి విరివిగా బియ్యప్పిండి జల్లుతుంది. పెట్టని తల్లయితే చాలీ చాలకుండా ఓ నాలుగు గీతలు గీస్తుంది. దాన్ని మళ్ళీ సాయంత్రం తుడిచి పారేసేలోపల మనం గబగబా తెచ్చుకోవాలి. అక్కడ అదయిపోయేక, ఇంకా కావాలంటే గుమ్మం దాకా వెళ్ళొచ్చు. అక్కడ గుమ్మానికి పసుపురాసి కుంకం, బియ్యప్పిండితో బొట్లు పెడతారు. అదంతా మనకి ఆహారమే. ఇది మంచి రంగులతో సువాసనలు కలిగి బాగుంటుంది. సర్వ సాధారణంగా అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఆ గుమ్మం దాటి లోపలికి ప్రవేశించకూడదు. ఇటు ముగ్గూ వెయ్యకుండా. అటు గుమ్మం దగ్గరా ఏమీ దొరక్కపోతే ఆపద్ధర్మంగా గుమ్మం దాటి లోపలికి అడుగు పెట్టవలసి వస్తే ఎప్పుడూ కూడా గోడవారగానే నడవాలి. అక్కడ బియ్యాన్ని, బెల్లంతో కలిపి జావలా చేసి దాంతో గోడవారంబట అంచులు వేస్తారు. అది ఉన్నాదంటే మనకి పండగే. ఇది ఓ వారం పదిరోజుల పాటు ఉంటుంది. వాళ్ళు మళ్ళీ కడిగేవరకూ ఈ అంచులన్నీ మనవే. ఇక దాన్ని దాటి లోపలికి వెళ్ళవలసిన అవసరమూ ఉండదు. మనం వెళ్ళాకూడదు. గోడకి ఈ అంచులకి మధ్యనే మన చోటు. ఈ విధంగా మనుషుల నడవడికలో, కట్టుబాట్లలోనూ ఆచారవ్యవహారాల్లోనూ మనకి కొంత ప్రాముఖ్యాన్నిచ్చేరు. మనం దాన్ని వినియోగం చేసుకుని మసలాలే తప్ప హద్దుమీరి ప్రవర్తిస్తే మన జాతికే ముప్పు.



ఎట్టి పరిస్థిల్లోనూ కూడా ఈ అంచులని దాటి గది మధ్యకి అడుగు పెట్టకూడదన్నది మన పిపీలికాన్వయ నియమం. అలా వెళ్ళిన పక్షంలో అక్కడ మనుషులుంటారు. వాళ్ళమధ్యకి వెళితే మన్ని నలిపేస్తారు, మట్టేస్తారు, నానా హింసా పెడతారు. ఇవన్ని తెలుసుకుని తెలివిగా బతకడం నేర్చుకోండి" అంటూ నీతులు చెప్పింది.

ఇంతలో తినుబండారం వెతుక్కురావడానికి వెళ్ళిన వీరులు మొహాలు వేళ్ళాడేసుకుని వెనుతిరిగి రావడం చూసి రాణి ఏం జరిగుంటుందా అనుకుంటూన్నంతలో ఆ వెనకే ఏదో ప్రమాదానికి గురై మరణించిన యోధులని మోసుకొస్తున్న కొంతమంది సైనికులు కనిపించేరు. మరింత ఖంగారుతో "ఎం జరిగిందని" అడిగింది రాణి.

"ఏం చెప్పమంటారు మహారాణీ! ఇక్కడ ఇళ్ళయితే ఉన్నాయి కానీ అందులో మనుషులు వాళ్ళ వాళ్ళ బతుకులు తప్ప ఇంకొక జీవకోటితో ప్రమేయం లేదన్నట్టుగా ఉన్నారు. మన మామూలు అలవాటు ప్రకారం వాకిట్లో ముగ్గు దగ్గరికి వెళ్ళేం. ఆశ్చర్యం! అదంతా రాతిముగ్గే. ఒక్క రేణువుకూడా ఆహారం లేదు. తర్వాత గుమ్మందగ్గరికి అక్కడ చూస్తే వాటికి రంగులు ఉన్న మాట నిజమే కానీ అవి పసుపూ, కుంఖం,

బియ్యప్పిండీ కావు. అసలదేమిటో కూడా అర్థం అవడం లేదు. అది గుమ్మాని బాగా అంటుకుపోయి ఉన్నాది. కొరక శక్యం కావడం లేదు. ఒకవేళ కష్టపడి కొరికినా డోకులు వచ్చేటంతలా ఏదో వాసన వస్తోంది. అయినా అందులో ఏమీ ఆహారం ఉన్నట్టు కనబడడం లేదు. అనివార్య పరిస్థితుల్లో గుమ్మం దాటొచ్చునన్న ప్రకారం గుమ్మం దాటి గృహప్రవేశం చేసేం. అక్కడ గోడవారగా అంచులు వేసి ఉండడంతో హమ్మయ్య అనుకుంటే అదే మన కొంప ముంచింది, మహారాణీ! అది మామూలుగా బియ్యప్పిండితో వేసిన అంచులు కావు. ఏదో సుద్దతో గీచినట్టుగా ఉంది. అది మన మామూలు ఆహారమేననుకుని మన సైనికులు కొంతమంది వెంటనే తిన ప్రయత్నించి వెనువెంటనే మరణించేరు, మహారాణీ. ఆ సుద్దలో ఏదో విషప్రయోగం ఉందని మా అనుమానం. అందుకే తక్షణ కర్తవ్యమేమిటో తమరు శలవిస్తారని త్వరగా స్థావరం చేరుకున్నాం" అంటూ మనవి చేసేరు ఆ సైనికులు. రాణీ కొంచెం సేపు ఆలోచించి మెల్లిగా అంది "సరే, మనుషులు స్వార్థంతో, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తే మనకి మరో మార్గం లేదు. మన పూర్వీకులు పెట్టిన నియమాలను అధిగమించి, అంచులుదాటి ఇళ్ళల్లో జొరబడి ఎక్కడ తిండి దొరికితే అక్కడికి వెళ్ళడమే మన తక్షణ కర్తవ్యం."